



**వాణిశ్రీ**

"ఏమండీ పెద్దోడికీ చిన్నోడికి ఫోన్ చేసి చెప్పారా?" అప్పటివరకూ పార్కులో కాలక్షేపం చేసి ఇంటికొచ్చిన సుందర్రావుని అడిగింది సావిత్రి.

సుందర్రావు సీరియస్‌గా చూశాడు భార్య వైపు.

"ఏంటే వాళ్లకి చెప్పేది?" అని ఎదురుప్రశ్న వేశాడు.

"అయ్యో రామా! ఇంటిని పడగొట్టించి డెవలప్‌మెంట్‌కి ఇస్తున్నామని చెప్పొద్దూ?" అన్నది.

"ఎందుకే వాళ్లకి చెప్పడం? ఇల్లు నా స్వార్జితం. నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను. ఎవడి పర్మిషన్ అక్కర్లేదు నాకు" ధుమధుమలాడుతూ అన్నాడు.

రిటైరైనప్పటి నుంచి సుందర్రావుకి మనశ్శాంతి కరువైంది. అసహనం ఎక్కువైంది. పొద్దునంతా ప్రశాంతంగా ఉంటాడు. ఈవెనింగ్ వాక్‌కని పార్కుకి వెళ్లొచ్చిన దగ్గర్నుంచీ మనిషిలో మార్పొస్తుంది. సీరియస్‌గా ఉంటాడు. పలకరిస్తే కొట్టినట్లు మాట్లాడతాడు.

"ఆ పార్కులో ఏ దెయ్యం పడుతుందో ఈయన్ని. వెళ్లొచ్చిన దగ్గర్నుంచి పిచ్చి పిచ్చిగా ఉంటాడు" అని సణుక్కుంటుంది సావిత్రి.

ఈవెనింగ్ వాక్‌కని వచ్చిన సీనియర్ సిటిజన్స్ భాగ్యలక్ష్మీనగర్ కాలనీలో ఉన్న మున్సిపాల్టీ పార్కులో బెంచీల మీద చేరుకుని ఇంటింటి రామాయణం వినిపిస్తుంటారు. కుళ్లిపోతున్న రాజకీయాల గురించో, చెడిపోతున్న సమాజం విషయమో, పెటాకులవుతున్న ప్రేమ పెళ్లిళ్ల టాపిక్కో ఎత్తుకుని గంటల తరబడి వాదించుకుంటారు. సుగర్ పేషెంట్లు ఆకలేస్తున్నది ఆగలేమంటూ తొందరగా నిష్క్రమిస్తారు. గట్టి పిండాలు నోళ్లు నొప్పి పెట్టేవరకూ, గొంతులో తడి ఆరిపోయేవరకూ ఉంటారు. కడుపులో ఎలుకలు పరిగెత్తుతుంటే అప్పుడు లేస్తారు.

సావిత్రి సణుక్కుంటున్నట్లే పార్కులో ఉన్నంతసేపూ సుందర్రావుని డబ్బు దెయ్యం పడుతుంది. సీనియర్ సిటిజన్స్‌లో చాలామంది పిల్లలు అమెరికాలోనో, లండన్‌లోనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా సెటిలయ్యారు. వీళ్లు ఊళ్లొదిలి పెట్టి రాజధాని చేరి వాళ్లు పంపిస్తున్న డాలర్లు, పౌండ్లు పెట్టి భూములు, ఇళ్లు కొంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

వాళ్ల సంభాషణల్లో దొర్లే లక్షలు, కోట్లు వింటూ తనకు చెవుడొచ్చినా బాగుండేది అని వాపోతుంటాడు. ప్రయోజకులైన కొడుకులుండడం ఎంత అదృష్టం? హు.. తనకీ ఉన్నారు కొడుకులు. ఏం లాభం? కొడుకుల్ని తల్చుకుంటే సుందర్రావుకి బి.పి. రెయిజైపోతుంది. వెధవాయిలు పనికిరాని చదువులు చదివారు. పెద్దోడేమో ఎం.కామ్ చదివి ఏదో కంపెనీలో లెక్కలు రాసుకుంటున్నాడు. పోనీ హైదరాబాద్‌లో కళ్ల ముందున్నాడా అంటే అదీలేదు. తోడల్లుడున్నాడనీ, పెళ్లాం మాటలు వినీ బెంగళూరు వెళ్లిపో

# గొయ్యి

యాడు. చిన్నోడు తనకు మెకానికల్ లైఫ్ బోరుకొడుతున్నది క్రియేటివ్ ఫీల్డ్‌కెళ్తానని గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకుని బొంబాయి వెళ్లిపోయాడు. ఏదో వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతున్నారు.

ఉద్యోగంలో ఉన్నంత కాలం సుందర్రావుకి హాయిగానే ఉంది. రిటైరైన తర్వాతే అసంతృప్తి మొదలైంది. ఆదాయం నాలుగో వంతుకి పడిపోయింది. పెన్షన్ డబ్బులు ఏ మూలకూ చాలడం లేదు. సంవత్సరం పొడుగునా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉన్న బంధువుల పిల్లల పెళ్లిళ్లనీ, గృహప్రవేశాలనీ, ఏవోకటి వస్తుంటాయి. పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి వెళ్దామా? ఇంటర్ సిటీకి బయల్దేరదామా? అని సావిత్రి మూటాముల్లె సర్దుకుని రెడీగా ఉంటుంది. డబ్బు ఖర్చు గురించి క్షణం ఆలోచించదు. మన పిల్లలు ఎటూ వెళ్లరు. మనం ఉన్నంతవరకు తప్పదు. లేకపోతే చుట్టరికాలేం మిగుల్తాయి? అని క్లాస్ పీకుతుంది.

తనతో పాటు రిటైరైన వాళ్లు ఐశ్వర్యంలో మునిగి తేలుతుంటే, తను డబ్బుకి కటకటలాడుతుండడం సుందర్రావుకి దుర్భరంగా ఉంది.

అటువంటి పరిస్థితుల్లో దేవుడిలా వచ్చి బంగారం లాంటి సలహా ఇచ్చాడు పరమేశం.

"ఇప్పుడు మన ఏరియా కూడా డెవలప్ అవుతూ ఉందోయ్ సుందర్రావూ! అపార్ట్‌మెంట్లు లేస్తున్నాయి. ఆరొందల గజాల స్థలంలో ఒక్కడివే ఇల్లు కట్టుకుని ఉంటే ఏం లాభం? డెవలప్‌మెంట్‌కివ్వరాదూ? ఏ బిల్డరైనా అపార్ట్‌మెంట్ కట్టి పన్నెండు ఫ్లాట్స్‌లో ఫిఫ్టీ ఫిఫ్టీ ఇస్తాడు. ఒక దాంట్లో నువ్వున్నా ఐదు ఫ్లాట్స్ అద్దెకిచ్చుకోవచ్చు. నెలకి నలభై, ఏభై వేలు ఆదాయం"

పరమేశం మాటలు సుందర్రావు మీద తారకమంత్రంలా పనిచేశాయి. ఈ మధ్యతరగతి జీవితం ఎన్నాళ్లు? పరమేశం సలహా భేషుగ్గా ఉంది. అపార్ట్‌మెంట్‌కి డెవలప్‌మెంట్‌కిస్తే దర్జాగా ఉండొచ్చు. కారు కొనుక్కుని డ్రైవర్ని గూడా మెయింటైన్ చెయ్యొచ్చు. పనిమీద సిటీలోకి బస్సుల్లో పోవాలంటే ప్రాణం మీదకి వస్తోంది. బస్సులు క్రిక్కిరిసి పోయి ఎక్కడానికి వీల్లేకుండా ఉన్నాయి. అదే కారుంటే వనస్థలిపురంలో ఉన్న కూతురి దగ్గరికి వెళ్లిరావొచ్చు. మనుమళ్లని కారులో తిప్పొచ్చు. పెళ్లిళ్లకు గూడా దర్జాగా కారులో షికారుగా పోవచ్చు. నలుగురిలో గౌరవంగా ఉంటుంది. ఎంతైనా కారున్న వాడికుండే గౌరవం వేరు కదా?

సుందర్రావు ఊహాలోకంలో తేలిపోయాడు. ఎవరైనా మంచి బిల్డర్‌తో మాట్లాడమని పరమేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు.

ఒక రోజు ఇంటి ముందు కారు ఆగింది. ఎవరా అని చూసేసరికి ఖద్దరు చొక్కా, పొందూరు పంచె కట్టుకున్న పెద్దమనిషి కారు దిగి వచ్చాడు.

"సుందర్రావుగారు మీరే కదా? పరమేశం మాట్లాడాడు. నా పేరు సుబ్బరాజు. బిల్డర్ని" అని పరిచయం చేసుకున్నాడు.

"నమస్కారం. రండి" అని ఆహ్వానించి సోఫాలో కూర్చోబెట్టి భార్యని కాఫీ తెమ్మని కేకపెట్టాడు.


"మేము సిటీలో కొన్ని అపార్ట్‌మెంట్స్ కట్టించాం. మీ కాలనీ గురించి మాకు తెలుసు. అన్నీ ఆరొందల గజాల ప్లాట్లు వేశారు అప్పట్లో సొసైటీ వాళ్లు. ఇందులో మున్సిపాల్టీ పర్మిషన్ తీసుకుని వన్ ప్లస్ టూ ఫ్లోర్స్‌లో పన్నెండు ఫ్లాట్స్ కడతాం. పర్మిషన్ లేకుండా మరొక రెండు ఫ్లోర్స్ కడతాం. ఆపైన పెంట్ హౌస్, రోడ్డుకి ఆనుకుని నాలుగు షట్టర్లు షాపుల కోసం కడతాం. ఫిఫ్టీ ఫిఫ్టీ. మీకు ఇష్టమైతే అగ్రిమెంట్ చేసుకుందాం" అన్నాడు సుబ్బరాజు.

"పర్మిషన్ లేకుండా కడితే ఏదైనా ప్రాబ్లమ్ రాదు కదా?" అనుమానంగా అడిగాడు సుందర్రావు.

సుబ్బరాజు నవ్వి "సిటీలో పర్మిషన్‌తో ప్లాన్ ప్రకారం కట్టినవి బహు తక్కువ. ఎక్కువ అన్ ఆథరైజ్డ్ కట్టడాలే. అదంతా మేం టౌన్‌ప్లానింగ్ వాళ్లని మేనేజ్ చేస్తాం లెండి" అన్నాడు.

"అగ్రిమెంట్ చేసిన తర్వాత సంవత్సరంలో పూర్తవుతాయా?" అడిగాడు సుందర్రావు.

"స్ట్రక్చర్ పూర్తవుతుంది. ఫ్లాట్స్ కొన్నవాళ్లు పేమెంట్ ఇవ్వడాన్ని బట్టి ఫినిషింగ్ ఉంటుంది. ఆథరైజ్డ్ ఫ్లాట్స్ కొన్నవాళ్లు బ్యాంక్ లోన్ తీసుకుని



పేమెంట్ చేసేస్తారం. ఎటు తిరిగీ అనాథరైజ్డ్ ఫ్లాట్స్ కొన్న వాళ్లకి బ్యాంక్ లోన్ దొరకదు. కాబట్టి కొంచెం లేటవుతుంది. మన అపార్ట్‌మెంట్ కాలనీ సెంటర్లో ఉంది కాబట్టి ఎలాగో అమ్ముడుపోతాయి. కాకపోతే ఐదారు నెలలు ఆలస్యం కావొచ్చు. అంతకంటే ప్రాబ్లమ్ ఏమీ లేదు. ఐనా కాలం ఎంతలో గడుస్తుందండీ. గిర్రున తిరిగి రాదూ?" అన్నాడు సుబ్బరాజు నవ్వుతూ.

బిల్డర్ మాటలు సుందర్రావు చెవులకు వీనులవిందుగా ఉన్నాయి. తనకు వచ్చే ఫ్లాట్స్, షాపులు లెక్కలేసుకుంటూ ఆనందంలో తేలిపోయాడు. అమ్ముకుంటే కోట్లే. లేకపోతే అద్దెలొస్తాయి. కొడుకులు అక్కరకు రాకపోయినా, అప్పుడెప్పుడో చౌకగా కొన్న భూమి తనను ఐశ్వర్యవంతుణ్ని చేస్తోంది. అతనికి హుషారుగా ఉంది. హెలికాప్టర్ ఎక్కి ఆకాశంలో మబ్బుల మధ్య చక్కర్లు కొడుతున్న అనుభూతి కలుగుతోంది.

○○○

బిల్డర్‌తో అగ్రిమెంటు రోజు అతనింట్లో పండగ వాతావరణం నెలకొంది. పార్క్ మిత్రులంతా అభినందించారు. కోటీశ్వరుడివైపోయావని పొగిడారు. ఇక సుందర్రావు నేల మీద నడవాల్సిన పని లేదనీ, కారులో షికార్లేనని ఆకాశానికెత్తేశారు.

"గురూ! ఈ సందర్భంలో శాంతి చెయ్యాలి" అని పరమేశం గుటకలు మింగాడు.

సుందర్రావు ఆనందంగా తల ఊపాడు. మగ్స్ అండ్ పెగ్స్ బార్‌లో అందరికీ టేబుల్స్ రిజర్వయ్యాయి. ఎవరి బ్రాండ్ వాళ్లది, ఎవరి డిష్ వాళ్లది అని చెక్ మీద సంతకం పెట్టేశాడు సుందర్రావు. బిల్లు తడిసి మోపెడైంది.

తర్వాత ఇల్లు ఖాళీ చేసి బిల్డర్‌కి అప్పగించాడు.

కాలనీలోనే నెలకి ఆరువేలు అద్దెకి ఫ్లాట్ తీసుకున్నాడు. అద్దె గాక నెలకి ఐదొందలు మెయింటెనెన్స్.

సావిత్రి ఉండబట్టలేక కొడుకులకు ఫోన్ చేసి విషయం చెప్పింది.

"నాన్నా! మన ఇల్లు అపార్ట్‌మెంట్స్ కట్టడానికిస్తున్నారటగా?" పెద్దకొడుకు బెంగళూరు నుంచి ఫోన్ చేసి అడిగాడు.

"ఔను. ఏం?"

"ఏం లేదు. ఇప్పుడంత అవసరం ఏమిటి? మేము చిన్నతనమంతా ఆ ఇంట్లో గడిపాం. ఇంటి ముందు వేపచెట్టు గాలి ఎంత ఆరోగ్యం? మామిడిచెట్టు కాయలు ఎంత తీపి? ఇక అమ్మ ఎన్ని రకాల పూల మొక్కలు పెంచింది? ఒక తోటలో పెరిగినట్లుగా ఉంది మాకు. అవన్నీ మా స్వీట్ మెమరీస్" అని వాపోయాడు.

"ఐతే నువ్వనేది ఏవిట్రా?"

"మీరున్నంత కాలం ఇల్లు అలా ఉంచితే మంచిదని నా ఉద్దేశ్యం. మేమెప్పుడైనా వచ్చినప్పుడు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుంటే మనసుకి హాయి ఉంటుంది. మా పిల్లలు తాతగారిల్లని చెట్లలో ఆడుకుంటారు. చిన్నప్పటి ఫ్రెండ్స్ ఎప్పుడైనా మనింటికి వస్తే ఆ నాటి కబుర్లు చెప్పుకుంటాం"

"మరీ అంత సెంటిమెంట్ పనికిరాదు. ప్రపంచం ఎంత మారిపోతున్నది? అన్నీ డబ్బుతో ముడిపడ్డాయి. డబ్బు పోగుచేయడం ఎలా అని ఆలోచించాలి. ఇల్లు పడగొట్టాలని బాధపడుతున్నావు గానీ డెవలప్‌మెంట్‌కిస్తే రెండు కోట్లు క్యాష్ వస్తుంది.

మనకొచ్చిన ఫ్లాట్స్ అమ్ముకుండా అద్దెలకిచ్చుకున్నా నెలకి ఏభైవేలు అద్దెలొస్తాయి. ఈ రోజుల్లో ఏం చేస్తే అంత డబ్బొస్తుంది? మీరేమైనా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల య్యారా లక్షలు సంపాదించడానికి, అణాకానీ ఉద్యోగాలు చేస్తున్నారు. ముందు ముందు నా అవసరాలకి మీరేం ఆదుకుంటారు? నా జాగ్రత్తలో నేనుండాలి గదా?" అని కొడుకుని చీవాట్లు పెట్టాడు సుందర్రావు.

చిన్నకొడుకు ఫోన్ చేసి "ఇల్లు పడగొట్టించకు నాన్నా! నీకు వచ్చే పెన్షన్ చాలకపోతే నెలనెలా ఎంతో కొంత పంపిస్తాను" అన్నాడు.

"ఏంట్రా నువ్వు పంపించేది ముష్టి?" అని మండి పడ్డాడు సుందర్రావు.

వనస్థలిపురంలో ఉన్న కూతురు గూడా తను పుట్టి పెరిగిన ఇల్లు పడగొడుతున్నారని తెలిసి బాధ పడింది. అల్లుడు మాత్రం తెగ సంతోషించాడు.

"అపార్ట్‌మెంట్‌లో మనకో ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఇవ్వమని మీ నాన్నకి టెండర్ పెట్టు" అన్నాడు.

"ఆ టెండరేదో మీరే పెట్టండి" అన్నది నవ్వుతూ.

ooo

బిల్డర్ సుబ్బరాజు ఇల్లు పడగొట్టించాడు. జె.సి.బి. తెప్పించి సెల్లార్ తీయించాడు. బోర్ తవ్వించాడు.


పక్క ఇంట్లో ఉంటున్న లాయర్ విశ్వనాథ్ సమాచార హక్కు చట్టం 2005 కింద సుందర్రావు స్థలంలో కట్టబోతున్న అపార్ట్‌మెంట్ అప్రూవ్డ్ ప్లాన్ కావాలని మున్సిపాల్టీ వారికి దరఖాస్తు పెట్టాడు. వాళ్లకి ఇవ్వక తప్పలేదు.

లాయర్ విశ్వనాథ్, సుబ్బరాజుని పట్టుకుని దబాయించాడు.


"ఏమండీ సుబ్బరాజుగారూ! ప్లాన్ ప్రకారం మా ఇంటి ప్రహరీగోడకి పక్కన పది అడుగులు, రోడ్డు ఫేసింగ్‌కి ఇరవై అడుగులు ఖాళీ స్థలం వదలాలి. మీరు మా ప్రహరీగోడకి ఐదడుగులు గూడా వదలకుండా సెల్లార్ తవ్వించారు. మీకు వన్ ప్లస్ టూకి మాత్రమే పర్మిషన్ ఉంది. పైన ఇంకొక రెండు ఫ్లోర్లు, పెంట్ హౌసూ కట్టబోతున్నారట. అలా కుదరదు"

"అది మామూలే కదండీ. ప్లాన్ ప్రకారం కడితే మాకేం మిగులుతుంది? మీకేం కావాలో అడగండి" అన్నాడు సుబ్బరాజు.

"నాకేం వద్దు. మీరు ప్లాన్ ప్రకారం కట్టుకోవాల్సిందే. లేకపోతే మిమ్మల్ని, మున్సిపాల్టీని కూడా కోర్టుకీడుస్తా!" అని రుసరుసలాడుతూ వెళ్లిపోయాడు లాయర్ విశ్వనాథ్.




సుబ్బరాజు లోకల్ లీడర్స్ తోను, ఆయన తోటి లాయర్స్ తోటి రాయబారం పంపించాడు. రాజీపడిపోతే బాగుంటుందని చూశాడు. కానీ లాయర్ విశ్వనాథ్ అనామకుడు కాదనీ, రాజకీయ పలుకుబడి ఇబ్బడి ముబ్బడిగా ఉన్నవాడనీ, స్వతహాగా తాపట్టిన కుందేలుకి మూడే కాళ్లనే రకమనీ, మొండి శిఖండనీ తెలుసుకుని లబోదిబోమన్నాడు సుబ్బరాజు.



"ఇల్లు పడగొట్టడానికి, ప్లాన్ అప్రూవ్ చేయించడానికి, సెల్లార్ తీయించడానికి, బోర్ వేయించడానికి నాలుగు లక్షలైంది. ప్లాన్ ప్రకారం కడితే నాకు గిట్టుబాటు కాదు" అని సుందర్రావుకో నమస్కారం పెట్టి పోయాడు సుబ్బరాజు.

సుందర్రావు అయోమయంలో పడిపోయాడు.

అద్దె ఫ్లాట్‌లో నానా బాధలూ పడసాగాడు. పెన్షన్ డబ్బు ఏ మూలకూ చాలడం లేదు. అప్పులు చేయాల్సొచ్చింది.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. సుందర్రావు గెడ్డం పెంచుకుని వస్తూపోతూ తన ఇంటి స్థలంలో ఉన్న పెద్ద గొయ్యిని చూస్తూ ఏడుపు దిగమింగుకుంటున్నాడు.

ఇప్పుడు గొయ్యి చెత్తాచెదారంతో నిండిపోయింది. వర్షం నీళ్లు నిండి మురికివాసన కొడుతుంటే, కాలనీ వాళ్లు సుందర్రావుని తిట్టుకున్నారు. ముసలోడికి ఆశ ఎక్కువై పాడైపోయాడు అని కామెంట్లు చేస్తున్నారు.

"చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా? బంగారం లాంటి ఇంటిని పడగొట్టించాడు. పచ్చటి చెట్లని కొట్టించాడు. ఆ పాపం తగిలింది" అంటున్నారు.

సుందర్రావుకి 'లాయర్ విశ్వనాథ్‌ని మర్డర్ చేయిస్తే?' అనే వికృతమైన ఆలోచనలతో నిద్ర కరువైంది.

ఒక రోజు తెల్లవారుజామున గుండెపోటుతో మరణించాడు సుందర్రావు. 'కోటీశ్వరుడవ్వాలనే కోరిక తీరకుండానే చనిపోయాడు పాపం!' అని పార్కులోని మిత్రులు సానుభూతి చూపించారు.

## దటీజ్ దీపిక!

దీపికా పదుకొనే ఇప్పుడు బాలీవుడ్‌లో బిజీ హీరోయినే కాదు, మంచి పారితోషికాన్ని కూడా డిమాండ్ చేయగల స్థితిలో వుంది. అయితే ఆమె తన తొలి చిత్రం 'ఓం శాంతి ఓం'కి మాత్రం పైసా కూడా తీసుకోలేదట. షారుఖ్ లాంటి అగ్రశ్రేణి హీరోకి జంటగా నటించడమే పెద్ద పారితోషికం అని ఫ్రీగా నటించానంటోంది దీపిక. నిజమేనని నమ్మొచ్చా? అని సందేహపడే వారిని మనమేం చేయలేం కదా!